## పల్నాడు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

మొదటిపేజీ తరువాయి - ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందడంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఆటోను బలంగా ఢీకొన్న ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత హృదయవిదారకమని ఆయన అన్నారు. మృతులందరూ చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందినవారిగా గుర్తించారని, ఒకే ప్రాంతానికి చెందిన పలువురు ఇలా అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం తీరని శోకాన్ని మిగిల్చిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘోరాలు పునరావృతం కాకుండా రహదారి భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## చిలకలూరిపేట వద్ద ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి - వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, చిలకలూరిపేట వద్ద ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## కేటీఆర్‌కు రాఖీ కడతారా, లేదా?.. కవిత రిప్లయ్ ఇదే!

మొదటిపేజీ తరువాయి - కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడికి రాఖీ కట్టే అవకాశం మరోసారి దక్కకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాఖీ పండుగ ప్రస్తావన రాగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. "ఈసారి కేటీఆర్‌కు రాఖీ కడతారా?" అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, "పోయినసారి అడిగితే ఆయన ఊర్లో లేకుండా పారిపోయారు. ఈసారి అడగకుండానే ఏకంగా విదేశాలకు వెళ్లిపోయారు. ఆడబిడ్డలమైన మాకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది కదా? మా ఆత్మగౌరవం చాలా తీవ్రంగా దెబ్బతింది" అని ఆవేదనతో అన్నారు. రాఖీ అంటే రక్త సంబంధమని, దాన్ని రాజకీయాలతో ముడిపెట్టకూడదని ఆమె హితవు పలికారు. రాఖీ విషయంలో తన అసంతృప్తిని వెళ్లగక్కడంతోనే కవిత ఆగలేదు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, బీజేపీ-ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం మెదక్‌లో రహస్య సమావేశాలు కూడా నిర్వహించారని అన్నారు. "నా సోదరుడు కేటీఆర్ చాలా అమాయకుడు, అందుకే నన్ను ఒక పథకం ప్రకారం పార్టీ నుంచి బయటకు పంపించారు" అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తీవ్ర అంతర్గత సంక్షోభం నడుస్తోందని, అందుకే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. పార్టీలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగానే ప్రజల పక్షాన నిలబడటంలో విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, తమలాంటి వారిని ఆశీర్వదించాలని కోరారు.

## పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు

మొదటిపేజీ తరువాయి - కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును విచారించేందుకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్-1లో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది. అయితే, ఈ నోటీసులపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఎథిక్స్ కమిటీ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలిచేసేందుకే ఈ కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, మందుల సామేల్, వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో మాట్లాడిన తీవ్రమైన పదజాలం, అసభ్య సైగల వీడియోలను ఈ సందర్భంగా వేముల ప్రదర్శించారు. సభలో సీఎం, అధికార పక్ష నాయకులు చేసిన బెదిరింపులు, వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని స్పీకర్ సిఫార్సు చేసిన సమయంలో అసలు ఎథిక్స్ కమిటీయే మనుగడలో లేదని, అలాంటప్పుడు ఆ అంశాన్ని కమిటీకి ఎలా రెఫర్ చేస్తారని వేముల నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధి పొంది ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేస్తున్న కడియం శ్రీహరి వైఖరిని మాత్రమే కౌశిక్ రెడ్డి ఆక్షేపించారని, దీనిపై కక్షపూరితంగా వ్యవహరించడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు.

## ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి - హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

## భారత్, చైనాలపై నేపాల్ మంత్రి ఆసక్తికర పోలిక.. రెండూ ముఖ్యమేనని స్పష్టం

మొదటిపేజీ తరువాయి - తండ్రి, తండ్రి స్థానాన్ని తల్లి భర్తీ చేయలేరని, ఈ రెండు దేశాలతో తమకు ఉన్న అనుబంధం అటువంటిదేనని ఆయన పేర్కొన్నారు. ఖాట్మండులో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో భారత్, చైనాలతో సమతుల్య దౌత్యంపై ఎదురైన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. నేపాల్‌ను చైనా తన గుప్పిట్లోకి తీసుకుందంటూ భారత మీడియాలో వస్తున్న కథనాలను ఆయన తోసిపుచ్చారు. తమ విదేశాంగ విధానం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, కేవలం దేశ ప్రయోజనాల ప్రాతిపదికన ఉంటుందని స్పష్టం చేశారు. నేపాల్ మొత్తం వాణిజ్యంలో మూడింట రెండొంతులు వాటా కేవలం భారత్‌తోనే జరుగుతోందని, ఈ విషయంలో మరో దేశం దరిదాపుల్లో కూడా లేదని ఆయన గుర్తుచేశారు. చైనా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ఒప్పందంపై కూడా ఆయన కీలక విషయాలు వెల్లడించారు. 2017లో ఒప్పందం కుదిరినప్పటికీ, గత పదేళ్లలో బీఆర్ఐ ప్రాజెక్టుల కింద తమకు ఒక్క డాలర్ నిధులు కూడా అందలేదని స్పష్టం చేశారు. నేపాల్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ఇంధనం, పర్యాటకం, సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో భారత కంపెనీలు ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు. ఈ మేరకు ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది.

## రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

మొదటిపేజీ తరువాయి - నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగస్వాములను చేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయాలు మారాల్సిన అవసరం ఉందని, వారిని తక్కువ అంచనా వేయరాదని హితవు పలికారు. బుధవారం నాడు ముంబైలో జరిగిన 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు, పాలనలో యువత భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతరంతో నా అనుభవం ద్వారా నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం చాలా సులభమైంది. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు, వారిని తక్కువ చేసి మాట్లాడొద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములను చేయాలి" అని అన్నారు. రాజకీయాల్లో యువత ప్రాధాన్యంపై ప్రస్తుత చర్చకు చాలా కాలం ముందే తాను, తమ ముఖ్యమంత్రి గారు యువతతో మమేకమవుతున్నామని లోకేశ్ గుర్తుచేశారు. తాము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు, అక్కడి యువత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమవుతామని వివరించారు. "'మేము ఇంకా మెరుగ్గా ఎలా చేయగలం?', 'ఈ నియోజకవర్గంలో విభిన్నంగా ఏం చేయొచ్చు?' అని వారిని అడుగుతాం" అని తెలిపారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల నుంచి ఎన్నో అద్భుతమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని, వాటిని కేవలం వినడమే కాకుండా, అమలు చేయడానికి తమ వద్ద ఒక పక్కా వ్యవస్థ ఉందని లోకేశ్ తెలిపారు. "యువత నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించి, వాటిని ఫాలో-అప్ చేసే విధానం మాకుంది. వారిని సంభాషణలో భాగం చేయడమే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. యువత సూచనలు, ఆలోచనలతో పాలనను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు కూడా తమ వైఖరిని మార్చుకోవాలని లోకేశ్ సూచించారు. "రాజకీయ నాయకులుగా మనం మన ఇగోని, అడ్డుగోడలను వదిలేయడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో యువత మీతో భావోద్వేగ స్థాయిలో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి కోరుకునేది కేవలం ప్రామాణికత మాత్రమే" అని అన్నారు. కల్మషం లేనితనం, పారదర్శకతే భారతదేశంలో తర్వాతి తరం రాజకీయ నాయకులకు ముఖ్యమైన లక్షణాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో నవతరం రాజకీయ నాయకుల నుంచి యువత ఆశిస్తున్నది అదేనని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రప్రదేశ్2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:

మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్-1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఎస్టీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి.

ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్-2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్-2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్: 25 సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-××: 7 సచివాలయం, హెచ్ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్‌డబీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

**వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.**

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

## భారత ప్రజాస్వామ్యం ప్రత్యేకం.. వంగింది తప్ప విరగలేదు: శశిథరూర్



పొరుగు దేశాల్లో యువత చేపట్టిన నిరసనల ధాటికి ప్రభుత్వాలు, వ్యవస్థలు కుప్పకూలినప్పటికీ, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మాత్రం ఆ ఒత్తిడికి "వంగింది తప్ప విరగలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఖాట్మండులో జరిగిన ఓ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి కాలంలో భారత్‌తో పాటు మయన్మార్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి ఆరు దక్షిణాసియా దేశాల్లో యువత సారథ్యంలో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. బంగ్లాదేశ్, శ్రీలంకలలో పాలకులు దేశం విడిచి పారిపోగా, నేపాల్‌లో ఎన్నికల ద్వారా పాలనలో మార్పు వచ్చిందని, పాకిస్థాన్‌లో సైన్యం కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు చోటుచేసుకుందని ఆయన వివరించారు. అయితే, భారత్‌లో పరిస్థితి వీటికి భిన్నంగా ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. భారత ప్రజాస్వామ్యంలో స్వీయ-సవరణ చేసుకునే యంత్రాంగం ఉందని, మారిన పరిస్థితులకు అనుగుణంగా మన వ్యవస్థ ఆశ్చర్యకరమైన వేగంతో సర్దుబాటు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. యువత నిరసనల నుంచి తలెత్తిన ప్రజా ఒత్తిడి కారణంగా ఒక మంత్రి రాజీనామా చేయాల్సి రావడమే ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. "భారత వ్యవస్థ వంగింది కానీ విరగలేదు. ఇదే అతిపెద్ద వ్యత్యాసం" అని శశిథరూర్ స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా స్పందించే ఈ లక్షణమే భారత ప్రజాస్వామ్యంపై తనకు నమ్మకాన్ని కలిగిస్తోందని, ఇది మన ప్రజాస్వామ్య బలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

మొదటిపేజీ తరువాయి - నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతుయాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలుబాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయంనేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీ) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని



సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది

మొదటిపేజీ తరువాయి - వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు



నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

## ముందు తరాలకు స్ఫూర్తిగా
# విగ్రహానికి రాఖీ కట్టిన సాహితి గౌడ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల ఆగస్టు 28 ఆస్తులు,అంతస్తులు పెరిగి అనుబంధాలు తగ్గిన ఈనాటి సమాజంలో ఆనవాయితి గా వస్తున్న రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా అన్నదమ్ములకు రక్షణగా రాఖీ కట్టి అక్క చెల్లెల్లు దీవెనలు అందజేస్తారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం కేంద్రంలో అయిలి స్వామి గౌడ్ కూతురు అయిలు సాహితి గౌడు గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహానికి రాఖీ కట్టి రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు విగ్రహ ప్రతిష్ట జరిగినప్పటి నుండి ప్రతి సంవత్సరం సాహితీ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి ఆనవాయితీగా రాఖీ కడుతూ వస్తుంది. పాపన్న మన మధ్యలో లేనప్పటికీ అయన ఆశయం ఇంకా బతికే ఉంది.కాబట్టి పాపన్న ఆశయం ముందు తరాలకు స్ఫూర్తిగా ఉండి తన ఆశయం వైపు పాపన్న మమ్మల్ని నడిపించాలని ప్రతి సంవత్సరం సాహితీ గౌడ్ సర్వాయి పాపన్న విగ్రహానికి రాఖీ కడుతుంది సాహితీ ఆకాంక్ష నెరవేరాలని కోరుకుందాం

# కిన్నెరసానిలో 29, 30న ఐటీడీఏ ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రీడలు

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 28(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 29, 30 తేదీల్లో కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన క్రీడల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు అంచెలుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా ఇప్పటికే పాఠశాల కాంప్లెక్స్ స్థాయి, అనంతరం డివిజన్ స్థాయి పోటీలను నిర్వహించారు. భద్రాచలం, ఇల్లందు, దమ్మపేట, ఖమ్మం, వైరా డివిజన్లలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, 60 మీటర్ల పరుగు, షాట్‌పుట్, టెన్నికాయిట్ తదితర క్రీడాంశాల్లో పురుషులు, మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించనున్నట్లు గోపాల్‌రావు వివరించారు. ఈ క్రీడా పోటీలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చందన ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నారు. ఐదు డివిజన్ల ఏటీడీవోలు, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారులు పోటీలను పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు.

# ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గా ఎస్కె చాంద్ పాషా ఎన్నిక



**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా మహా సభలో జూలూరుపాడు మండలము వెంగాన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్కె చాంద్ పాషా ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.నా పై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా గారి కి ధన్యవాదాలు తెలియజేశారు.

# రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్సెట్టిపేట సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ల ఏర్పాటు, మరమ్మత్తు పనులు.



**లక్సెట్టిపేట, పోరు తెలంగాణ, ఆగస్టు 28 :** లక్సెట్టిపేట సబ్ స్టేషన్ లో 33/11 కేవీ నూతన బ్రేకర్లను ఏర్పాటు చేయడంతో పాటు పలు మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏ ఈ గణేష్ తెలిపారు. 29వ తేదీ శనివారం, 30వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్సెట్టిపేట, ఉత్కూర్, మొదెల, గంపలపల్లి, ఇటిక్యాల గ్రామాలకు తరచుగా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే సమయాన్ని వినియోగదారులు గమనించి, అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతు పనుల నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని ఏ ఈ కోరారు.

# ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలి







జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 28, 2026:** ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్థవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ఎస్ ఐ ఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ జలాలను భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాలకు అందించాలి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు





**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాలకు సీతారామ కెనాల్ ద్వారా గోదావరి జలాలను అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం ఆయన సిపిఐ రైతు సంఘం నాయకులతో కలిసి జూలూరుపాడు మండలం లోని వినోబా నగర్ గ్రామ సమీపంలోని రాజీవ్ లింకు కెనాల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తరలించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని,సీతారామ కెనాల్ నిర్మాణంతో భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల రైతులు భూములను కోల్పోయారని,అయినప్పటికీ ఈ ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు.రైతుల ఆందోళనను గమనించి సిపిఐ ఆధ్వర్యంలో నాయకుల బృందం లింకు కెనాల్ ను సందర్శించడం జరిగిందన్నారు.జూలూరుపాడు మండలంలోని కప్పల కుంట,శనగచెరువు,దండాల చెరువు లో గోదావరి జలాలను నింపి వాటి ద్వారా సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు తరలించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఇదే విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,నేటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.డిస్ట్రిబ్యూటరీ కాలవల నిర్మాణం పూర్తి అయ్యేసరికి మరో ఏడాది పడుతుందని,ప్రభుత్వం ఈ మూడు చెరువుల్లో నీటిని నిలిపి అక్కడినుంచి సింగభూపాలెం చెరువుకు గోదావరి జలాలను తరలించి రైతుల పంటలకు సాగునీరు అందించాలని కోరారు.అదేవిధంగా బూర్గంపాడు,అశ్వరావుపేట ఇల్లందు,భద్రాచలం తదితర ప్రాంతాల్లోని రైతులకు గోదావరి జలాలను అందించేందుకుగాను ప్రత్యేకంగా రెగ్యులేటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు.ఆనాడు సాగునీటి కోసం కమ్యూనిస్టు పార్టీలు ఎంతగానో పోరాటం చేశాయని గుర్తు చేశారు.రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గోదావరి జలాలను అందించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సబీర్ పాషా,కొత్తగూడెం మేయర్ మూడు గణేష్,సీతారామ ఈఈ మహేశ్వరరావు,డిఈ చంద్రశేఖర్,ఏఈ శ్రావణి,సుజాతనగర్ ఎంపీడీవో భారతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్,సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య,యలంకి మధు,ఎస్.కె నాగులుమీరా,తాత నరసింహారావు,చెరుకుమల్ల రాజేశ్వరరావు,ఊడల సుధ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 28, 2026:** ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి బోధన, తరగతుల నిర్వహణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ విచారణలను పరిశీలించి ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో నిర్వహిస్తున్న పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులో భాగంగా కోలాం గిరిజన కుటుంబాలకు మామిడి, ఉసిరి, పనస, జామ, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాలకు పౌష్టికాహారం, భవిష్యత్తులో అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, మండల విద్యాధికారి, ఎఫ్‌పిసి ఛైర్మన్ ఎంబడి కిషన్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సర్పంచ్‌లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ నగర్ పద్మశాలి సంఘం
# ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు


నూతన సంఘ సభ్యుల ఎన్నిక

కులబాంధవుడి పదవి విరమణ కార్యక్రమం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగభూషణం ఆధ్వర్యంలో, రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పద్మశాలి కుల దైవమైన మార్కండేయుడికి ప్రత్యేక పూజలు చేశారు.వేడుకల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.అనంతరం కుల బాంధవుడు మానేటి మురళి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన కీర్తి" శేషులు చౌటి లక్ష్మీ నర్సు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రవి కుమార్,సుజాత దంపతులు జలధార పాత్రను మార్కండేయుడికి బహుకరించారు.అనంతరం సంఘం ఆధ్వర్యంలో జంజీరాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల బంధువులు,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండ మండల కేంద్రంలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలో ఓటరు నమోదు జాబితాలో జరిగిన పొరపాట్లపై అదనపు కలెక్టర్ భుజంగరావు స్పందించారు.ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల వయసు,ఇంటి పేరు మొదలగు సవరణలను సంబంధిత బిఎల్ఓ లు రీ సర్వే చేసి ఒక ప్రత్యేక వెబ్సైట్ కు పంపిస్తారని తెలిపారు. బిఎల్ఓ ఓటరు జాబితాలో పేరును కొనసాగించేందుకు సంబంధిత పత్రాలను అందజేయాలని కోరారు. తమ జనన వివరాలతో పాటు తల్లిదండ్రులకు సంబంధించిన జనన పత్రాలను,లేదా ఇతర ఆధారాలను నిర్ణీత సమయానికి అందించాల్సి ఉంటుందని కోరారు.వారం పది రోజుల వ్యవధిలో సంబంధిత ఓటర్లకు సవరించిన నమోదు పత్రాలను అందిస్తారని ఆయన తెలిపారు.ఓటర్ల యొక్క నిజ నిర్ధారణ కొరకు ఈ సవరణ అవసరమని కోరారు.ముసాయిదా జాబితా ప్రకారం వారి ముగింపు జాబితా కూడా ఉంటుందని,ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురి కాకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కులకు అండగా నిలిచింది మందకృష్ణ మాదిగ

## ఎమ్మార్పీఎస్ నాయకులు సాయికుమార్

## జూలూరుపాడు లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా వికలాంగుల హక్కుల పోరాటం సమితి ఆవిర్భావ దినోత్సవం





**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** జూలూరుపాడు మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికలాంగుల సాధన సమితి నాయకుడు భూక్యా బాలు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు దెబ్బెందుల సాయికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల నావకు తెరచాప మందకృష్ణ మాదిగ గారని,దివ్యాంగుల ఉద్యమాల పోరుబాట చూపిన ఘనత మందకృష్ణ మాదిగ దేనని,వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వికలాంగుల పెన్షన్లు ఏ పాలకుడి ఘనత కాదు,పోరాటం ప్రవాహంతో శాసించి సాధించుకున్నవేనని,వందల మంది వికలాంగులను వెంటబెట్టుకుని మందకృష్ణ మాదిగ ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించారని అన్నారు. 2007 లో కేవలం 200 రూపాయలు ఉన్న పెన్షన్ ను 2007 నవంబర్ 26న నిజాం కాలేజ్ గ్రౌండ్ లో జరిగిన మహాగర్జన సభలో 1500కు పెంచాలని డిమాండ్ చేసి సాధించారని గుర్తుచేశారు. మందకృష్ణ మాదిగ విహెచ్పిఎస్ ఏర్పాటు చేయకముందు ఏ ఒక్క పార్టీ పాలకుడు వికలాంగులను కనీసం గుర్తించలేదని,వికలాంగుల పోరాటం ఆత్మగౌరవ పోరాటమని,ఇది పాలకులు చూపిన సానుభూతితో వచ్చింది కాదు,శాసించి హక్కులు సాధించుకున్నారని అన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వికలాంగులకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు రిజర్వేషన్లు కల్పించే వరకు,రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకటి కృష్ణ,ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు చాపలమడుగు నరసింహారావు,ఎమ్మార్పీఎస్ నాయకులు మంద బాబు, కాకటి సుదర్శనం, వికాస్,కిన్నెర కుమార్, కిరణ్, సురేష్,చింటూ, భీమ్ సింగ్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు స్వామి కి ఘనంగా సన్మానం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 28 ఓదెల మండలం మడక గ్రామంలో ఇటీవల నూతనంగా ఓదెల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోషిక స్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గిద్దమారి రమేష్,తుడి సంపత్,పేరవేన సతీష్, మ్యాడగొని రాజు,ఎలుకపల్లి దుర్గయ్య,రాజోజుల సత్యం,మ్యాకల లక్ష్మయ్య, లింగయ్య,లక్ష్మయ్య,అసంపల్లి సురేందర్, గూడెల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలి

## విలీనం కాని గ్రామాలను చేర్చాలని జేఏసీ డిమాండ్..

## ఈ నెల 31, సెప్టెంబర్ 1న రిలే నిరాహార దీక్షలు..



**మహేశ్వరం, ఆగస్టు 28 పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మహేశ్వరంలో శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇప్పటికే విలీనమయ్యాయని జేఏసీ నాయకులు తెలిపారు. మిగిలిన గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఎంపీడీవోతో పాటు జేఏసీకి అందజేయాలని సూచించారు.ఈ అంశంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.జేఏసీ ఛైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, విద్య, వైద్యం, తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం పెట్టుబడుల ఆకర్షణకు నిదర్శనమన్నారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే రహదారులు అభివృద్ధి కానుండటంతో మహేశ్వరం రవాణాపరంగా కీలక ప్రాంతంగా మారుతుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్, మెట్రో, రతన్ టాటా 300 ఫిట్ రేడియల్ రోడ్లు, మల్టీమోడల్ రవాణా వ్యవస్థలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.కొత్త పరిశ్రమలు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, రహదారుల అభివృద్ధితో రియల్ ఎస్టేట్, నిర్మాణం, రవాణా, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలు విస్తరించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మహేశ్వరం ప్రాంతానికి భారీగా ప్రయోజనం చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు మెరుగైన నగరాన్ని అందించేందుకు ప్రతి గ్రామ పంచాయతీ ముందుకు రావాలని ఆయన కోరారు.ఫ్యూచర్ సిటీలో విలీనం కోసం తీర్మానం చేయని గ్రామాల సర్పంచ్‌ల తీరుకు నిరసనగా ఈ నెల 31, సెప్టెంబర్ 1న మహేశ్వరం లోని ప్రభుత్వ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకుడు కడారి జంగయ్య, సీపీఐ నాయకుడు దత్తునాయక్, బీజేపీ మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, జేఏసీ సలహాదారు కె. జగన్‌రెడ్డి, గోటికె రవీందర్‌రెడ్డి, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లూర్ గ్రామంలో ఓటర్ల నమోదు ప్రక్రియను సందర్శించిన అదనపు కలెక్టర్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండల కేంద్రంలోని నల్లూరు గ్రామంలో నిర్వహించబడుతున్న ఓటర్ల నమోదు సవరణ ప్రక్రియ సరళిని అదనపు కలెక్టర్ భుజంగరావు సందర్శించారు.నమోదు ప్రక్రియలో జరిగిన తప్పుడు సవరణలు పేర్లు,వయసు వంటి వాటిపై సంబంధిత బిఎల్ఓ లు రీ సర్వే చేయాలని,ఓటర్ల ఓటు హక్కును కాపాడాలని, ప్రతి ఓటు అవసరమని, తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముంతాజుద్దీన్, సర్పంచ్ గంగాధర్, జిపిఓ సురేష్, వార్డు సభ్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి రోజున రక్త బంధంతో మొక్క నాటించిన వన ప్రేమికుడు



**పోరు తెలంగాణ నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ వాస్తవ్యులు అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య ఇంటి వద్ద రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్త బంధం తన తల్లిదండ్రులు నల్లగొండ ఉప్పలమ్మ చంద్రయ్య తన ఇద్దరు చెల్లెలు జల్లే సూరమ్మ.జల్లె పూలమ్మ వారితో మామిడి మొక్కను నాటించడం జరిగింది.ఈ సందర్భంగా వన ప్రేమికుడు సమ్మయ్య మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి అన్నారు. అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రక్షాబంధన్ గుర్తుగా నాటిన ఈ మామిడి మొక్క ముందు తరాలకు చెట్టై మంచి వాతావరణం ఫలములు అందించాలని భగవంతున్నీ వేడుకొని ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పూలాజీ బాబా జయంతి ఏర్పాట్లు

## డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ.....





**పోరు తెలంగాణ ఆగస్టు 28: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు పూలాజీ బాబా 82వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం పరిశీలించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, భక్తుల రాకపోకలు, భద్రత అంశాలపై చర్చించారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ జాదవ్ తనాజీ తదితరులు పాల్గొన్నారు.

# అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ కోసం ఒత్తిడి తెస్తాం

## డా.పాల్వాయి హరీష్ బాబు....



**పోరు తెలంగాణ ఆగస్టు 28: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబును కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 5 లక్షల మంది ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ హామీ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై వాయిదా తీర్మానం ప్రవేశపెట్టి చర్చకు పట్టుపడతామని డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఇటీవల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్ల అక్రమ టెర్మినేషన్ విషయంలో అండగా నిలిచి తిరిగి ఉపాధి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

## మహేశ్వరం విద్యుత్ ఎఈ చక్రపాణి..



**మహేశ్వరం, ఆగస్టు 24, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** నేడు మండల పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు తుక్కుగూడ సబ్ స్టేషన్ పరిధిలోని సర్దార్ నగర్, బాసగూడ, ఫ్యూచర్ ఈ సారాప్రాజెక్ట్, వర్టెక్స్ ఫ్రెండ్స్, రిత్విక్ విలాస్, మల్లెమాల స్టూడియో, అర్కల ప్రాజెక్టు, చల్లా ఎలైట్, నార్త్ స్టార్, స్పీడ్ ఇన్ ఫ్రా, గ్లోబల్ డెవలపర్స్, మల్లెమాల స్టూడియో ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా



**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 28 :** భీమారం గ్రామానికి చెందిన సాటపురం మాధవి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భీమారం శాఖలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) లో పేరు నమోదు చేసుకొని ఇటీవల అనారోగ్య కారణాలతో ఆమె మరణించగా, బీమా క్లెయిమ్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఆమె నామినీ అయిన భర్త సాటపురం శ్రీనివాస్ కి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం శాఖ కార్యనిర్వాహణ అధికారి జి. సుబ్బారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -- భీమారం శాఖ కార్యనిర్వాహణ అధికారి జి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా బీమా పథకాలలో పేరు నమోదు చేసుకొని కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జి. సుమంత్, సిబ్బంది బి. శంకర్, కె. సతీష్ కుమార్, పి.ఎస్.వై. తేజస్వి, ఆర్. గణకామేష్ మరియు అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన రాఖీ పండుగ వేడుకలు





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల ఆగస్టు 28 శుక్రవారం ఆస్తులు,అంతస్తులు పెరిగి అనుబంధాలు తగ్గిన ఈనాటి సమాజంలో ఆనవాయితి గా వస్తున్న రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా అన్నదమ్ములకు రక్షణగా రాఖీ కట్టి అక్క చెల్లెల్లు దీవెనలు అందజేస్తారు. అనంతరం అక్కాచెల్లెళ్లకు కట్న కానుకలు అందజేస్తారు రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం లో గ్రామం గ్రామాన ప్రతి ఇంట రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు తెలంగాణ రాష్ట్రంలో పండుగ అంటే ప్రతి ఒక్కరి గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయే ఆనందాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి పండుగను కుటుంబ సమేతంగా ఆనంద ఉత్సాహాలతో గ్రామ గ్రామాన జరుపుకుంటారు దూరం ఎంతున్న అన్నా ధమ్ముల మీద ప్రేమ రాఖీ పండుగ తో దగ్గర చేస్తుందని నమ్మకం.


# సంత వద్ద అంబులెన్స్ బైక్ ఢీ.. తృటిలో తప్పిన ప్రమాదం



**బూర్గంపాడు, ఆగస్టు 28: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మండలంలోనిమొరంపల్లి బంజర గ్రామంలోని సంత వద్ద శుక్రవారం అంబులెన్స్ ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. అంబులెన్స్--బైక్ ఢీకొన్నప్పటికీ చిన్న చిన్న గాయాలు అవడం తో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంత సమయం కావడంతో ఆ ప్రాంతంలో రద్దీగా ఉండటంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంత ప్రాంతంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

# గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తా

## సర్పంచ్ దేవేందర్ నాయక్..





**మహేశ్వరం, ఆగస్టు 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** గంగారం గ్రామాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తానని సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్ తెలిపారు. శుక్రవారం మైలార్ బాయ్ తండాలో మునావత్ మంజుల మల్లేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నా యని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గంగారం గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను నెరవేర్చడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్వాల మహేందర్, మాజీ ఉపసర్పంచ్ సూర్య నాయక్, వార్డు సభ్యులు దేవ, రవి, జ్యోతి, గోపి ధర్మ, శ్రీనివాస్, తులసి, శ్రీనివాస్ లచ్చ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన పారిజాత నరసింహారెడ్డి




**మహేశ్వరం, ఆగస్టు 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** బడంగ్ పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డి శుక్రవారం రేవంత్ రెడ్డిని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు అందించాలని ఆమె కోరుకున్నారు.

## రాష్ట్రస్థాయి ఆత్య పాత్య పోటీలకు జైపూర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ఎంపిక




**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 28 :** మంచిర్యాలలోని ముల్కల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి ఆత్య పాత్య పోటీలు నిర్వహించడం జరిగింది. అందులో జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు బోర్లకుంట సాయి సహజ్, దేశెట్టి జస్వంత్, పాగే రాము, కొత్తపల్లి ప్రేమ్ సాగర్, జి అనుదీప్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపల్ కోల నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 29, 30 తేదీలలో నిర్మల్ జిల్లాలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి ఆత్య పాత్య పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు గాంధర్ల సంతోష్ పీడీ, రత్నం శ్రీనివాస్ పి ఇ టి, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, హౌస్ మాస్టర్లు అనిల్ కుమార్, వీ శ్రీనివాస్ మరియు మధుకర్ లు విద్యార్థులను అభినందించారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆశించారు. విద్యార్థులు క్రీడలలో ప్రతిభ చూపించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పథకాలు పొందినట్లయితే తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ మరియు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోట ద్వారా గవర్నమెంట్ ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ



**పోరు తెలంగాణ, ఆగస్టు 28 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉప్పల్ భగాయత్ లో గల 5 ఎకరాల భూమిలో నిర్మించబోతున్న భవన నిర్మాణానికి శంకుస్థాపన తేది గురించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని సమయం తీసుకొనుట కొరకు సభ్యులు కలిసినడు . దీనికి వారు వెంటనే స్పందించి సెప్టెంబర్ 13 వ తేదీన శంకుస్థాపన కొరకు సమయం ఇచ్చినారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం తరపున ధన్యవాదములు తెలిపినారు.

## నెక్కొండ CI గా ఫణిదర్ బాధ్యతలు




**పోరు తెలంగాణ నెక్కొండ ఆగస్టు 28:** నెక్కొండ సర్కిల్ నూతన జ× గా బాధ్యతలు స్వీకరించిన ఫణిదర్ ని మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ పెండ్యాల హరి ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడ్య తిరుమల చౌహన్ లు కలిసి శాలువాతో సత్కరించారు.మండలంలో శాంతిభద్రతలు, గంజాయి, అక్రమ మద్యం నియంత్రణ పై సమర్ధవంతంగా పని చేయాలని కోరారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**పోరు తెలంగాణ, మంచిర్యాల :** రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. చెల్లెలు ప్రేమగా అన్నయ్య చేతికి రాఖీ కట్టి, ఆప్యాయంగా కేక్ తినిపించింది. అన్నయ్య కూడా చెల్లెలి ప్రేమకు ముగ్ధుడై, ఆమె పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. ఆ క్షణంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధం అందరి మనసులను హత్తుకుంది. "మన మధ్య ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని కష్టాలు ఎదురైనా మన ప్రేమ మాత్రం ఇలాగే ఉండాలి. మన తుది శ్వాస వరకు ఈ అనుబంధాన్ని కాపాడుకుందాం" అంటూ అన్నాచెల్లెళ్లు ఒకరికొకరు ప్రేమగా మాట ఇచ్చుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం చెల్లెలు ఇంటికి తిరిగి వెళ్తుండగా అన్నయ్య మనసు భారమైంది. "చెల్లెమ్మా.. మళ్లీ ఎప్పుడు వస్తావు? ప్రతి రోజూ రాఖీ పౌర్ణమి రోజే అయితే ఎంత బాగుండేది" అంటూ ఆప్యాయంగా వీడ్కోలు పలికాడు.

## చెరగని కవితా ఝురి



తెలుగు కవిత సృజన ప్రపంచంలోకి ఎన్.అరుణ 'మౌనమూ మాట్లాడుతుంది' అనే కవితా సంపుటితో ప్రవేశించడం నాటి సాహితీ లోకంలో ఒక ఆశ్చర్యం. విద్యార్థి దశలోనే సాహితీ సృజన చేసినా కుటుంబ బాధ్యతలకు అంకితమై నిశబ్దంగా ఉన్న అరుణ ఒక్కసారిగా కవిత్వాన్ని వెల్లువలా సృష్టించి వ చన కవితా చరిత్రలో తనదైన స్థానాన్ని అందుకున్నారు. అగ్నిపర్వతం బద్దలైతే ప్రమాదకరమైన లావా వెలువడుతుంది. అరుణ హృదయం బద్దలై కవిత్వ పరిమళ ప్రవాహం లోకాన్ని ముంచెత్తింది. మౌనం కొత్త వర్ణమాలను సృష్టించుకొని, సరికొత్త వ్యాకరణాన్ని అల్లుకొని మాట్లాడిన మాటలు పాఠకలోకంలో వినూత్న అనుభూతులను, ఆలోచనలను ఆవిష్కరించాయి. 'నన్ను నేనెప్పుడూ వెతుక్కుంటూనే ఉంటాను/ మనస్సు నిండా చిన్న చిన్న శూన్యాలుంటాయి/ ఆ శూన్యాలకు భాష్యమే మౌనం'

## చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు దరఖాస్తులకు చివరి తేదీ 31-08-2026

**తెలంగాణ మంచిర్యాల జిల్లా, ఆగస్టు 28 :** జైపూర్ మండలంలోని గ్రామ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 31-08-2026గా ఉన్నందున అర్హులైన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జైపూర్ మండల ఎంపీడీఓ శ్రీపతి బాపు రావు తెలిపారు.

దరఖాస్తు చేసుకోగల 7 రకాల చేయూత సామాజిక భద్రత పెన్షన్లు1. వితంతువులు
2. ఒంటరి మహిళలు
3. దివ్యాంగులు
4. రక్త సంబంధిత దివ్యాంగులు
5. కల్లుగీత కార్మికులు
6. చేనేత కార్మికులు
7. పైలేరియా బాధితులు

అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 31-08-2026లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన పారిజాత నరసింహారెడ్డి..

**మహేశ్వరం, ఆగస్టు 28, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** బడంగ్ పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డి శుక్రవారం రేవంత్ రెడ్డిని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు అందించాలని ఆమె కోరుకున్నారు.




## రాఖీ దారంలో అన్నాచెల్లెళ్ల అపురూప ప్రేమ..!

### రాఖి కట్టిన చెల్లి..

### కన్నీళ్ళతో సాగనంపిన అన్న ...!

**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 28 :** రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. చెల్లెలు ప్రేమగా అన్నయ్య చేతికి రాఖీ కట్టి, ఆప్యాయంగా కేక్ తినిపించింది. అన్నయ్య కూడా చెల్లెలి ప్రేమకు ముగ్ధుడై, ఆమె పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. ఆ క్షణంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధం అందరి మనసులను హత్తుకుంది. "మన మధ్య ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని కష్టాలు ఎదురైనా మన ప్రేమ



మాత్రం ఇలాగే ఉండాలి. మన తుది శ్వాస వరకు ఈ అనుబంధాన్ని కాపాడుకుందాం" అంటూ అన్నాచెల్లెళ్లు ఒకరికొకరు ప్రేమగా మాట ఇచ్చుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం చెల్లెలు ఇంటికి తిరిగి వెళ్తుండగా అన్నయ్య మనసు భారమైంది. "చెల్లెమ్మా.. మళ్లీ ఎప్పుడు వస్తావు? ప్రతి రోజూ రాఖీ పౌర్ణమి రోజే అయితే ఎంత బాగుండేది" అంటూ ఆప్యాయంగా వీడ్కోలు పలికాడు. "ఇంటికి జాగ్రత్తగా వెళ్లు.. ఫైలమ్ జాగ్రత్త" అంటూ ప్రేమగా సాగనంపాడు. రాఖీ దారం కేవలం చేతికి కట్టే దారం కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య జీవితాంతం నిలిచే

## కాళ్లు లేదా పాదాలు విపరీతమైన నొప్పిగా ఉన్నాయా..? అయితే ఈ చిట్కాలను పాటించండి..!

శారీరక శ్రమ లేదా వ్యాయామం అధికంగా చేసినప్పుడు, వాకింగ్, రన్నింగ్ ఎక్కువ సేపు చేసినా, లేదా పలు ఇతర కారణాల వల్ల కూడా మనకకు అప్పుడప్పుడు కాళ్ల నొప్పులు వస్తుంటాయి. సాధారణంగా ఒక రోజు విశ్రాంతి తీసుకుంటే ఈ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే కొందరికి కాళ్ల నొప్పులు అంత త్వరగా తగ్గవు. పైగా పోషకాహార లోపం, అసౌకర్యవంతమైన పాదరక్షలను ధరించడం, ఆర్థరైటిస్, అధికంగా బరువు ఉండడం వంటి సమస్యలు ఉన్నవారికి కాళ్ల నొప్పులు వస్తే ఇంకా ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది. అయితే ఈ నొప్పులు తగ్గేందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పలు పదార్థాలతోనే సహజసిద్ధంగా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. అందుకు గాను పలు చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.



### ఎప్సం సాల్ట్, నీలగిరి తైలం..

ఒక బకెట్‌లో సగం వరకు గోరు వెచ్చని నీళ్లను తీసుకుని అందులో కాస్త ఎప్సం సాల్ట్‌ను వేసి కలిపి ఆ బకెట్‌లో కాళ్లను ముంచి ఉంచాలి. ఇలా 15 నిమిషాల పాటు ఉంచితే నొప్పుల నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. అలాగే వేడి నీటిలో టవల్‌ను ముంచి దాంతో కాపడం పెడుతున్నా కూడా నొప్పులు తగ్గిపోతాయి. కాళ్లు లేదా పాదాల నొప్పులను తగ్గించేందుకు నీలగిరి తైలం బాగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక బకెట్ లో వేడి నీటిని పోసి అందులో కొద్దిగా నీలగిరి తైలం వేయాలి. అనంతరం అందులో కాళ్ళను ఉంచాలి. మోకాళ్ళ వరకు కాళ్ళను బకెట్ లో ముంచి ఉంచాలి. 15 నిమిషాల పాటు కాళ్ళను అలా ఉంచితే కాళ్ళ నొప్పులు తగ్గుతయి. తర్వాత కాళ్ళను బయటికి తీసి సాధారణ నీటితో కడుక్కోవాలి. దీంతో కాళ్ళ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### పుదీనా టీ, మెంతుల నీళ్లు..

నీలగిరి తైలంకు బదులుగా యాపిల్ సైడర్ వెనిగర్‌ను కూడా ఉయోగించవచ్చు. దీంతో కూడా కాళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు.

ఇక నొప్పి ఉన్న ప్రదేశంపై మంచు ముక్కలు ఉండే ఐస్ ప్యాక్‌తోనూ కాపడం పెట్టినట్లు పెట్టాలి. కొద్ది నిమిషాల పాటు మర్దనా చేసినట్లు ఐస్ ప్యాక్‌ను రాయాలి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. వాపులు తగ్గుతాయి. కాళ్ల నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. పుదీనా ఆకులతో టీ తయారు చేసుకుని తాగడం వల్ల కూడా కాళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. ఈ ఆకుల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. అలాగే రెండు గ్లాసుల నీటిని తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ మెంతులను రాత్రిపూట నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే ఆ నీటిని తాగాలి. మెంతుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి.

### విటమిన్ డి ఆహారాలు..

విటమిన్ డి లోపం ఉన్నవారిలోనూ కాళ్లు లేదా కండరాలు నొప్పులకు గురవుతుంటాయి. కనుక విటమిన్ డి ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది. విటమిన్ డి మనకు ఎక్కువగా చేపలు, మాంసం, కోడిగుడ్డు పచ్చ సొన, తృణ ధాన్యాలు, పుట్ట గొడుగులు, సోయా మిల్క్, ఓట్ మీల్ వంటి ఆహారాలలో లభిస్తుంది. అలాగే నిత్యం ఉదయాన్నే కొంత సేపు సూర్యరశ్మిలో నిలబడాలి. దీంతో కూడా మనకు విటమిన్ డి లభిస్తుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తూ ఆయా ఆహారాలను తింటుంటే కాళ్లు, పాదాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

## ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్న హమాస్ మద్దతుదారులు వీడియో



ఇజ్రాయిల్ పార్లమెంట్ కెనెసెట్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(ప్రసంగిస్తున్న సమయంలో కొందరు సభ్యులు అడ్డుకున్నారు. ట్రంప్ ప్రసంగం ప్రారంభించిన అయిదు నిమిషాల్లోనే హమాస్‌కు మద్దతు పలుకుతూ ఇద్దరు సభ్యులు నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఆ ఇద్దరు కెనెసెట్ సభ్యులను బయటకు లాక్కెళ్లారు. ఆ సమయంలో కాసేపు ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపారు. చాలా సమర్థవంతంగా భద్రతా సిబ్బంది వ్యవహరించినట్లు ఆ ఘటన తర్వాత ట్రంప్ అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో ఇది చరిత్రాత్మకమైన కొత్త ఆరంభం అన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూకు ఆయన థ్యాంక్స్ తెలిపారు. నెతన్యహూ ధైర్యం అసామాన్యమైందన్నారు. చర్చలకు సహకరించిన అరబ్ దేశాలకు కూడా ట్రంప్ థ్యాంక్స్ చెప్పారు.

ఇదొక అద్భుత విజయం అన్నారు. ఇక ఇజ్రాయిల్‌లో స్వర్ణయుగం మొదలైందని, యావత్ ప్రాంతానికే ఇది స్వర్ణ యుగమన్నారు. ఇజ్రాయిల్ ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యుడు ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. పాలస్తీనాను గుర్తించండి అంటూ ఆయన ఓ ప్లకార్డు పట్టుకున్నారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఆ సమయంలో స్పీకర్ ఆమిర్ ఓహనా గట్టిగా అరిచారు. నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంకే సభ్యుడిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రెండేళ్ల పాటు హమాస్ చెరలో ఉన్న 20 మంది బంధీలు ఇవాళ ఇజ్రాయిల్ చేరుకున్నారు. ఆయుధాల వల్లే శాంతి వెలిసినట్లు ట్రంప్ చెప్పారు. ఆయుధాలు కావాలంటూ ఇజ్రాయిల్ తనను పలుమార్లు కోరిందని, దీంతో ఇజ్రాయిల్ శక్తివంతంగా తయారైందన్నారు. దీని వల్ల శాంతి ఏర్పడినట్లు ట్రంప్ చెప్పారు. శాంతి ఒప్పందం కోసం పనిచేసినవారిలో ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, అడ్వైజర్ జేర్డ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సెక్రటరీ పీట్ హెగ్‌సేత్ కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. కెనెసెట్‌లో ప్రసంగించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అబ్రహం, ఇసాక్, జాకబ్ దేవతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఆకాశం నిర్మలంగా మారిందని, తుపాకులు మూగబోయాయని, సైరన్లు మోగుతున్నాయని, పవిత్ర భూమిలో శాంతి సూర్యుడు ఉదయించాడని ట్రంప్ అన్నారు. ఇక ఎప్పటికీ ఈ ప్రాంతం శాంతియుతంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది యుద్ధానికి ముగింపు మాత్రమే కాదు%ౌ% టెర్రర్, మరణాలకు కూడా ఇది ముగింపు యుగమన్నారు. విశ్వాసం, దేవుడిపై నమ్మకం పెరిగే యుగం ఇది అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో కొత్త చరిత్ర లిఖితమైందన్నారు.

## తుప్పల్లో దొరుకుతుంది రోగాల తుప్పు వదిలిస్తుంది ఈ తీగ గురించి ఎవ్వరికీ తెలియని నిజాలు




తిప్పతీగను గిలోయ్ అని కూడా పిలుస్తారు. దాని ఔషధ గుణాల కారణంగా ఇటీవల ప్రాచుర్యం పొందింది. ఇది టి హెల్పర్ కణాలు, మాక్రోఫేజ్‌ల సంఖ్యను పెంచి, బి కణాల ద్వారా యాంటీబాడీల ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా రోగనిరోధక శక్తిని గణనీయంగా బలోపేతం చేస్తుంది. స్థూలకాయం, వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే వాపును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ప్రకృతిలో ఎన్నో రకాల సహజ ఔషధ మొక్కలు ఉన్నాయి.. ఇవి ఎన్నో అనారోగ్య సమస్యలకు దివ్యౌషధంలా పనిచేస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అలాంటి పవర్‌ఫుల్ ఔషధ మొక్కల్లో తిప్పతీగ ఒకటి.. డైలీ తిప్పతీగ రసం తీసుకుంటే.. చాలా అనారోగ్య సమస్యలు దూరం చేసుకోవచ్చు.. ఇక తిప్పతీగ ప్రత్యేకత ఏంటంటే.. ఆకులు, కాండం, వేర్లు.. అన్ని విలువైనవే.. అందుకే.. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలలో తిప్పతీగ ప్రాముఖ్యత ఈ మధ్య కాలంలో చాలా మందికి సుపరిచితమైంది. పల్లెటూళ్ళలో పొలాల గట్ల మీద, పొదలలో విరివిగా కనిపించే ఈ మొక్కను ఆయుర్వేద వైద్య శాస్త్రం ఏనాడో గుర్తించి దాని ఉపయోగాన్ని తెలియజేసింది. అయితే, ఇటీవల పలు రకాల వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దీని ఔషధ గుణాలపై ప్రజలకు అవగాహన మరింత పెరిగింది. తిప్పతీగలో ఉన్న శాస్త్రీయ ప్రయోజనాల గురించి ఆయుర్వేద నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.

### శాస్త్రీయ ఆవిష్కరణలు, ఫైటోకెమికల్స్

తిప్పతీగలో 35 రకాలకు పైగా ఔషధ గుణాలు కలిగిన ఫైటోకెమికల్స్ ఉన్నాయని గుర్తించారు. వీటిలో ముఖ్యంగా 15 రకాల ఆల్కలాయిడ్స్, ఆరు రకాల గ్లైకోసైడ్స్, ఐదు రకాల డై టర్పినాయిడ్స్, నాలుగు రకాల స్టిరాయిడ్స్, ఐదు రకాల ఆలిఫ్యాటిక్ కాంపౌండ్స్ ఉన్నాయి. ఈ రసాయన సమ్మేళనాలు తిప్పతీగకు అద్భుతమైన ఔషధ లక్షణాలను అందిస్తాయి. 2016 సంవత్సరంలో, లక్నోలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్ తిప్పతీగపై జరిపిన 170 పరిశోధన పత్రాల సారాంశాన్ని సంగ్రహించి, దాని ప్రయోజనాలను ధృవీకరించింది.

### రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే విధానం

తిప్పతీగ ప్రధానంగా రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా శరీరానికి రక్షణను అందిస్తుంది.

**టి హెల్పర్ కణాల పెరుగుదల:** మన శరీరంలోకి వైరస్‌లు లేదా బ్యాక్టీరియాలు ప్రవేశించినప్పుడు వాటిని పసిగట్టే టి హెల్పర్ కణాలు కీలక పాత్ర పోషిస్తాయి. తిప్పతీగ ఈ టి హెల్పర్ కణాల సంఖ్యను గణనీయంగా పెంచుతుంది. ఈ కణజాలం పెరగడం వల్ల శరీరం త్వరగా స్పందించి, వ్యాధికారక క్రిములను గుర్తించి, రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేస్తుంది.

**మాక్రోఫేజ్ కణాల పనితీరు మెరుగుదల:** టి హెల్పర్ కణాలు సమాచారం అందించిన వెంటనే, మాక్రోఫేజ్ కణాలు రంగంలోకి దిగుతాయి. ఈ కణాలు రక్తంలో సంచరిస్తూ వైరస్‌లు, బ్యాక్టీరియాలను మింగేస్తాయి. మాక్రోఫేజ్‌లలో ఉండే లైసోజోమ్‌లు అనేవి మింగిన క్రిములను భస్మం చేస్తాయి. తిప్పతీగ ఈ లైసోజోమ్‌ల సంఖ్యను పెంచుతుంది.. తద్వారా వైరస్‌లు, బ్యాక్టీరియాలు త్వరగా నాశనం అవుతాయి.

**యాంటీబాడీల ఉత్పత్తి:** భవిష్యత్తులో అదే వైరస్ లేదా బ్యాక్టీరియా మళ్ళీ శరీరంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి యాంటీబాడీలు చాలా అవసరం. తిప్పతీగ బీ కణాలను ఉత్తేజపరుస్తుంది. ఇవి యాంటీబాడీల ఉత్పత్తిని పెంచుతాయి.. తద్వారా దీర్ఘకాలిక రక్షణ లభిస్తుంది.

### వాపు నిరోధక, ఇతర ప్రయోజనాలు

తిప్పతీగ రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా, శరీర వాపును తగ్గించడంలో కూడా తోడ్పడుతుంది.

**స్థూలకాయంలో వాపు:** స్థూలకాయం ఉన్నవారిలో కొవ్వు కణాలు అధికంగా వాపును కలిగిస్తాయి, ఇది వైరస్ ఇన్ఫెక్షన్ల తీవ్రతను పెంచుతుంది. తిప్పతీగలో అరబినో గలాక్టిన్ అనే రసాయనం ఉంటుంది, ఇది స్థూలకాయం వల్ల కలిగే వాపును తగ్గించి, ఇన్ఫెక్షన్ తీవ్రత పెరగకుండా సహాయపడుతుంది.

**హానికరమైన రసాయనాల నియంత్రణ:** వైరస్ లేదా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు, శరీరం ఇంటర్‌లూకిన్-6 టిఎన్ఎఫ్-ఆల్ఫా వంటి కొన్ని రసాయనాలను అధికంగా విడుదల చేస్తుంది. ఈ రసాయనాలు వాపును పెంచి, ఊపిరితిత్తులు వంటి అవయవాలకు నష్టం కలిగిస్తాయి. తిప్పతీగలో ఉండే రసాయనాలు ఈ హానికరమైన కెమికల్స్‌ను తగ్గించి, శరీరాన్ని వాపు నుంచి త్వరగా కోలుకునేలా చేస్తాయి.

### తిప్పతీగను ఉపయోగించే విధానాలు

**తిప్పతీగను వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు:**

పల్లెటూళ్ళలో లభించే వారికి: తాజా తిప్పతీగ ఆకులను శుభ్రంగా కడిగి ముద్దగా చేసి, కొద్దిగా తేనె కలుపుకుని మింగవచ్చు. లేదా, ఒక లీటరు నీటిలో ఆకులను వేసి, నీరు సగం అయ్యే వరకు మరిగించి, వడకట్టి, తేనె కలుపుకుని కషాయంగా తాగవచ్చు. పట్టణాల్లో లభించే వారికి: పట్టణాల్లో తిప్పతీగ పొడి మార్కెట్‌లో లభిస్తుంది. ఈ పొడిని రెండు విధాలుగా వాడవచ్చు. ఒక స్పూన్ పొడికి కొద్దిగా తేనె కలిపి నేరుగా తినవచ్చు. లేదా, ఒక స్పూన్ పొడిని 100-150 ఎశ్రీ నీటిలో వేసి సగం అయ్యే వరకు మరిగించి, వడకట్టి, తేనె కలుపుకుని డికాక్షన్‌గా త్రాగవచ్చు. ఈ విధంగా తిప్పతీగను ఉపయోగించడం ద్వారా శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేయవచ్చుని, వైరస్‌లు, బ్యాక్టీరియాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చుని శాస్త్రీయంగా నిరూపించబడింది. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏమైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే. నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం..

## సమ్మర్‌లో చిన్నారుల రక్షణకు ఏం చేస్తున్నారు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే



ఎండలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం మనందరిపై ఉన్నప్పటికీ ముఖ్యంగా చిన్న పిల్లలపై ఇది చాలా తీవ్రంగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మొటిమలు రావడమే కాకుండా చర్మం కందిపోయే ప్రమాదం ఉంది. మన చిన్నారిని ఎండల తాకిడి నుండి ఎలా కాపాడుకోవాలో చూద్దాం.

### పాటించాల్సిన నియమాలు

వేసవిలో పిల్లలను శుభ్రంగా ఉంచడం మొదటి ప్రాధాన్యత కావాలి. ఇందుకోసం ప్రతిరోజూ స్నానం చేయించడం తప్పనిసరి. ఇలా చేయడం వల్ల వారు ఉత్సాహంగా ఉండటమే కాకుండా వారికి మంచి రిఫ్రెష్ మెంట్ లభిస్తుంది. ప్రతిరోజూ సబ్బు లేదా షాంపూ వాడాల్సిన అవసరం ఉండదు. ఇది చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పిల్లలకు వేసే దుస్తుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో బిగుతుగా ఉండే దుస్తులు అస్సలు వేయకూడదు. వేసవిలో పిల్లలకు తగినంత నీరు లేదా ద్రవ పదార్థాలు అందేలా చూడాలి. మీ చిన్నారి ఆరోగ్యం పట్ల మీరు తీసుకునే శ్రద్ధ వారి భవిష్యత్తుకు పునాది అని గుర్తించాలి.

## ఫ్రిజ్‌లో ఉన్నా ఆహారం పాడవుతోందా వేసవిలో వంటకాలు తాజాగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి



ఎండలు ముదురుతున్న కొద్దీ మన చుట్టూ ఉన్న వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తాయి. వేసవిలో కేవలం దాహం ఇంకా అలసట మాత్రమే కాదు ఆహారం నిల్వ చేయడం కూడా ఒక పెద్ద సవాలుగా మారుతుంది. అధిక ఉష్ణోగ్రతలు ఇంకా తేమ కారణంగా మనం తినే పదార్థాల్లో బ్యాక్టీరియా శరవేగంగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల ఆహారం చాలా త్వరగా పాడైపోయి విషపూరితంగా మారుతుంది. పర్యవసానంగా ఫుడ్ పాయిజనింగ్, డయేరియా వంటి తీవ్రమైన జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఈ ప్రమాదకర పరిస్థితుల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే వంటింట్లో మనం చేసే పనుల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా వేసవి కాలంలో వాతావరణంలోని వేడి వల్ల ఆహారంలోని కొవ్వులు విచ్ఛిన్నమై దుర్వాసన వస్తుంటాయి. ముఖ్యంగా పాలు, పప్పులు ఇంకా మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలపై బ్యాక్టీరియా ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆహారాన్ని ఎక్కువ సేపు బయట ఉంచి ఆ తర్వాత ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కూడా అది త్వరగా పాడవుతుంది. అందుకే రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 1 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉండేలా చూసుకోవాలి. వండిన ఆహారాన్ని రెండు గంటలలోపు ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది. అయితే వేడి వేడి పదార్థాలను నేరుగా ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రతకు వచ్చే వరకు చల్లారనివ్వాలి. లేదంటే ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరిగి ఇతర వస్తువులు కూడా పాడయ్యే అవకాశం ఉంది.

### ఫ్రిజ్ లో వద్దు

చాలామంది చేసే పొరపాటు ఏంటంటే.. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఇంకా వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెట్టడం. నిజానికి వీటిని ఫ్రిజ్‌లో పెడితే తేమ వల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. వీటిని ఎప్పుడూ గాలి తగిలే పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. అలాగే ఫ్రిజ్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం చాలా అవసరం. మురికిగా ఉన్న ఫ్రిజ్ బ్యాక్టీరియా వృద్ధికి కేంద్రంగా మారుతుంది. ఆహారాన్ని నిల్వ చేసేటప్పుడు ఎప్పుడూ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. పాత ఆహార పదార్థాలను కొత్తగా వండిన వాటితో కలపడం వల్ల కూడా ఇన్ఫెక్షన్లు త్వరగా వ్యాపిస్తాయి. కాబట్టి తాజాగా ఉన్నవాటిని విడిగా ఉంచడమే క్షేమం. పండ్లు ఇంకా కూరగాయల విషయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం. ఆకుకూరలను కడిగి బాగా ఆరబెట్టిన తర్వాత పేపర్ టవల్‌లో చుట్టి నిల్వ చేస్తే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కోసిన పండ్లను వెంటనే తినేయాలి లేదా గాలి చొరబడని డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇక మాంసాహారం విషయానికి వస్తే మాంసం, చేపలు ఇంకా గుడ్లను ఇతర వంటకాలతో కలవకుండా విడివిడిగా భద్రపరచాలి. వేసవిలో వండని మాంసం నుండి వెలువడే బ్యాక్టీరియా వండిన పదార్థాలకు సోకకుండా చూసుకోవడం అత్యంత కీలకం. ఇది ఆహారం కలుషితం కాకుండా కాపాడుతుంది.

### పదేపదే వేడి చేయొద్దు

ఆహారాన్ని పదేపదే వేడి చేసే అలవాటును మానుకోవాలి. ఒకటి కంటే ఎక్కువసార్లు వేడి చేయడం వల్ల ఆహారం యొక్క నాణ్యత ఇంకా భద్రత రెండూ దెబ్బతింటాయి. వంట చేయడానికి ఇంకా వడ్డించడానికి ఎప్పుడూ శుభ్రమైన పాత్రలను మాత్రమే వాడాలి. చేతులు కూడా శుభ్రంగా కడుక్కోవడం వల్ల బ్యాక్టీరియా వ్యాప్తిని అరికట్టవచ్చు. వేసవిలో ఆహారం పట్ల తీసుకునే ఇటువంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆరోగ్య సమస్యల నుండి రక్షిస్తాయి. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారాన్ని పద్ధతి ప్రకారం నిల్వ చేసి తీసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా గడపవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని గుర్తించి మెలిగితే ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావు.

## పచ్చి కొబ్బరి అటుకుల ఉండలు.. ఇలా చేసి తింటే రుచికి ఇంటిల్లిపాది ఫిదా







పచ్చి కొబ్బరి అటుకుల ఉండలు పిల్లలకు బలాన్ని ఇస్తాయి. కాబట్టి, మీరు కూడా మీ ఇంట్లో ఈ స్వీట్ రెసిపీని ట్రై చేసి వారికి రోజుకొకటి పెట్టండి ఎంతో ఇష్టంగా తింటారు. ఎలా చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం.. కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు అటుకులు, ఒక కప్పు పచ్చి కొబ్బరి తురుము అర కప్పు బెల్లం తురుము, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి , ఒక టేబుల్ స్పూన్ యాలకుల పొడి , 10 జీడిపప్పు, 10 కిస్మిస్ లు తీసుకోవాలి. కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు అటుకులు, ఒక కప్పు పచ్చి కొబ్బరి తురుము అర కప్పు బెల్లం తురుము, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి , ఒక టేబుల్ స్పూన్ యాలకుల పొడి , 10 జీడిపప్పు, 10 కిస్మిస్ లు తీసుకోవాలి.

1 / 5

మీరు ముందుగా ఒక కప్పు అటుకులను తీసుకుని పాన్‌లో వేసి మీడియం మంటపై బాగా వేయించాలి. అది చల్లారిన తర్వాత మిక్సీలో వేసి వాటిని పొడిలాగా చేసుకోవాలి. ఇక ఇప్పుడు అదే పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి 10 జీడిపప్పు, కిస్మిస్ కూడా వేయించాలి. మీరు ముందుగా ఒక కప్పు అటుకులను తీసుకుని పాన్‌లో వేసి మీడియం మంటపై బాగా వేయించాలి. అది చల్లారిన తర్వాత మిక్సీలో వేసి వాటిని పొడిలాగా చేసుకోవాలి. ఇక ఇప్పుడు అదే పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి 10 జీడిపప్పు, కిస్మిస్ కూడా వేయించాలి.

2 / 5

ఇక ఇప్పుడు బెల్లం తురుమును తీసుకుని దానిలో బాగా కరిగించి పాకంలాగా చేసుకుని దీనిలో ఒక కప్పు పచ్చి కొబ్బరి తురుమును వేసి గరిటెతో కానీ చేతితో కానీ బాగా కలపి పక్కన పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు బెల్లం తురుమును తీసుకుని దానిలో బాగా కరిగించి పాకంలాగా చేసుకుని దీనిలో ఒక కప్పు పచ్చి కొబ్బరి తురుమును వేసి గరిటెతో కానీ చేతితో కానీ బాగా కలపి పక్కన పెట్టుకోవాలి.

3 / 5

ఆ తరువాత చివర్లో ఒక కప్పు అటుకుల పొడి వేసి దీనిలో మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ తర్వాత యాలకుల పొడి, జీడిపప్పు, 10 కిస్మిస్ వేసి కలిపి దించేయాలి. ఇది వేడిగా ఉన్నప్పుడే చేతులతో చిన్న చిన్న ఉండలుగా చేసుకుని ప్లేట్ లో పెట్టుకోవాలి. ఆ తరువాత చివర్లో ఒక కప్పు అటుకుల పొడి వేసి దీనిలో మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ తర్వాత యాలకుల పొడి, జీడిపప్పు, 10 కిస్మిస్ వేసి కలిపి దించేయాలి. ఇది వేడిగా ఉన్నప్పుడే చేతులతో చిన్న చిన్న ఉండలుగా చేసుకుని ప్లేట్ లో పెట్టుకోవాలి.

4 / 5

అంతే, వేడి వేడి పచ్చి కొబ్బరి అటుకుల ఉండలు రెడీ. ఇవి పిల్లలకు బలాన్ని ఇస్తుంది. కాబట్టి, ఈ రెసిపీని ఇంట్లో ట్రై చేసి పెట్టి వారికి రోజుకొకటి పెట్టండి. ఎంతో ఇష్టంగా తింటారు. అంతే, వేడి వేడి పచ్చి కొబ్బరి అటుకుల ఉండలు రెడీ. ఇవి పిల్లలకు బలాన్ని ఇస్తుంది. కాబట్టి, ఈ రెసిపీని ఇంట్లో ట్రై చేసి పెట్టి వారికి రోజుకొకటి పెట్టండి. ఎంతో ఇష్టంగా తింటారు.

## బ్లాక్ కాఫీతో కేలరీలు మంచులా కరిగిపోవాలా గ్రీన్ టీ వర్సెస్ బ్లాక్ కాఫీ ఏది బెస్ట్




నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత పెరిగింది. బరువు తగ్గడం కోసం డైట్ చేసేవారు, జిమ్‌కు వెళ్లేవారు ఎక్కువగా 'గ్రీన్ టీ' లేదా 'బ్లాక్ కాఫీ'ని ఆశ్రయిస్తుంటారు. ఈ రెండూ కూడా తక్కువ కేలరీలు కలిగి ఉండి, శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తాయి. కానీ, మీ శరీరతత్వానికి ఏది సరిపోతుంది? వేగంగా కొవ్వును కరిగించే సత్తా దేనికి ఉంది? అనే సందేహాలకు సమాధానం ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి రక్షణగా నిలిస్తే, బ్లాక్ కాఫీలోని కెఫీన్ తక్షణ శక్తిని అందిస్తుంది. ఒకటి పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును నిదానంగా కరిగిస్తే, మరొకటి వ్యాయామం చేసే సమయంలో మీ శారీరక సామర్థ్యాన్ని పెంచుతుంది. ఆకలిని నియంత్రించడంలో, కేలరీలను దహించడంలో ఈ రెండింటి మధ్య ఉన్న పోరాటంలో విజేత ఎవరు వైద్య నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు చూద్దాం.

**1. గ్రీన్ టీ**

ముఖ్య పదార్థం: ఇందులో జు+జ+ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది వ్యాయామం చేసేటప్పుడు కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది.

కెఫీన్: ఇందులో కెఫీన్ తక్కువగా ఉండటం వల్ల గుండెపై ఒత్తిడి పడదు. ఎసిడిటీ సమస్య ఉన్నవారికి ఇది ఉత్తమ ఎంపిక.

ప్రయోజనం: ఇది నిదానంగా కానీ, దీర్ఘకాలికంగా బరువు తగ్గడానికి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

**2. బ్లాక్ కాఫీ**

ముఖ్య పదార్థం: ఇందులో కెఫీన్ అధికంగా ఉంటుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి, మెటబాలిజంను 3-11% వరకు వేగవంతం చేస్తుంది.

**శక్తి ప్రదాత:** వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగడం వల్ల శక్తి స్థాయిలు పెరిగి, ఎక్కువ సేపు వర్కౌట్ చేసే సామర్థ్యం వస్తుంది.

ఆకలి నియంత్రణ: ఇది ఆకలిని కలిగించే హార్మోన్లను తాత్కాలికంగా అణచివేస్తుంది, దీనివల్ల తక్కువ ఆహారం తీసుకుంటారు.

ఏది ఎంచుకోవాలి మీరు వేగంగా కేలరీలను దహించాలనుకుంటే: బ్లాక్ కాఫీ ఉత్తమం. ఇది విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేలా చేస్తుంది.

**మీకు ఎసిడిటీ లేదా నిద్రలేమి సమస్యలు ఉంటే:** గ్రీన్ టీ సురక్షితమైన మార్గం. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో కూడా మేలు చేస్తుంది. ఏది తాగినా పరిమితంగా తీసుకోవడం ముఖ్యం. బ్లాక్ కాఫీని మరీ రాత్రిపూట తాగడం వల్ల నిద్రకు భంగం కలగవచ్చు. మీ జీవనశైలికి మరియు మీ శరీర అవసరాలకు అనుగుణంగా సరైన పానీయాన్ని ఎంచుకుని, క్రమబద్ధమైన వ్యాయామంతో మీ ఫిట్‌నెస్ లక్ష్యాలను చేరుకోండి. ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు.

# ప్రభుత్వ ఉద్యోగులకు బిగ్ షాక్..!

# ఇకపై వారికి నో గ్రాట్యుటీ! పూర్తి వివరాలు ఇవే..



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల గ్రాట్యుటీ నిబంధనలపై %ణశ్రీూాఔ% స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 26, 2023 నాటి మెమోరాండం ప్రకారం, పదవీ విరమణ తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరిన వారికి ఇది ఒకసారి మాత్రమే పొందే ప్రయోజనం. ఒకసారి గ్రాట్యుటీ పొందితే, రెండోసారి చెల్లించరు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకింత ఆందోళనకు గురించే విషయాలు బయటికి వచ్చాయి. పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ (%ణశ్రీూాఔ%) గ్రాట్యుటీ నియమాలను స్పష్టం చేసింది. డిసెంబర్ 26, 2025న జారీ చేసిన ఇటీవలి ఆఫీస్ మెమోరాండంలో ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు, వారు ఎప్పుడు పెన్షన్ లేకుండా మిగిలిపోతారో ప్రభుత్వం స్పష్టం చేసింది. పదవీ విరమణ తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరినా లేదా సైన్యం నుండి పదవీ విరమణ చేసిన తర్వాత పౌర సేవలో చేరిన వారికి ఈ నిర?యం చాలా సందరోచితంగా ఉంటుంది. %ణశ్రీూాఔ% ప్రకారం.. %చీూా% కింద కవర్ చేయబడిన ఉద్యోగుల గ్రాట్యుటీని ఇప్పుడు వన్-టైమ్ టెర్మినల్ బెనిఫిట్‌గా పరిగణిస్తారు. అంటే పదవీ విరమణ తర్వాత ఒకేసారి పొందే బెనిఫిట్. సరళంగా చెప్పాలంటే గ్రాట్యుటీ అంటే ఉద్యోగి పదవీ విరమణ తర్వాత వారి సేవకు బదులుగా చెల్లించే మొత్తం. ఒక ఉద్యోగి పదవీ విరమణ తర్వాత తప్పనిసరి పదవీ విరమణ తర్వాత లేదా మరేదైనా కారణం వల్ల ఉద్యోగం నుండి నిష్క్రమించినప్పుడు ఇప్పటికే గ్రాట్యుటీని పొందినట్లయితే, తిరిగి ఉద్యోగంలో చేరిన తర్వాత వారికి రెండవ గ్రాట్యుటీ చెల్లించరు. తమ మొదటి ఉద్యోగం పూర్తి చేసుకున్న తర్వాత ప్రభుత్వ శాఖలో తిరిగి చేరే వారికి ఈ నియమం కొంచెం క్లిష్టంగా ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తి తమ మునుపటి సైనిక లేదా పౌర సేవలో గ్రాట్యుటీని పొందినట్లయితే, వారు తిరిగి ఉద్యోగంలో చేరినప్పుడు మళ్ళీ గ్రాట్యుటీని పొందలేరు. సైన్యం నుండి పదవీ విరమణ చేసిన తర్వాత చాలా మంది సైనికులు పౌర సేవలలో చేరడం తరచుగా గమనించవచ్చు. ఇప్పటివరకు దీని గురించి గందరగోళం ఉండేది, దీనిని ప్రభుత్వం ఈ మెమోరాండం ద్వారా పరిష్కరించింది. అయితే ప్రభుత్వం కొన్ని ప్రత్యేక సందరాలేలో మినహాయింపులు కూడా మంజూరు చేసింది. ఒక ఉద్యోగి గతంలో ప్రభుత్వ రంగ సంస్థ లేదా స్వయంప్రతిపత్తి సంస్థలో పనిచేసి, ఆ సంస్థ నుండి గ్రాట్యుటీ పొందిన తర్వాత, తగిన ఆమోదంతో కేంద్ర ప్రభుత్వ సేవలో చేరితే, నియమాలు కొద్దిగా భిన్నంగా ఉంటాయి. అటువంటి ఉద్యోగి తమ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ప్రత్యేక గ్రాట్యుటీని పొందవచ్చు. కానీ ఇక్కడ ఒక చిక్కు ఉంది. రెండు ప్రదేశాల నుండి కలిపి గ్రాట్యుటీ కేంద్ర ప్రభుత్వానికి పూర్తి సమయం సేవ చేస్తే ఒక ఉద్యోగి పొందే మొత్తానికి సమానంగా ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని అర్థం మీరు రెండు ప్రదేశాల నుండి ప్రయోజనాలను పొందవచ్చు, కానీ గరిష్ట పరిమితి ఉంది.

## బంగారంపై సీన్ రివర్స్.. మారిన ప్రజల మూడ్..

# దానికి బదులు ఏం కొంటున్నారంటే..?




బంగారం రేట్లు 2025లో కొనుగోలుదారులకు చుక్కలు చూపించాయి. చరిత్రలో ఎన్నడూ పెరగనంతగా రికార్డ్ స్థాయిలో పెరిగాయి. దీంతో ప్రజల మైండ్ సెట్ కూడా మారింది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడం మానేసి వేరే మార్గంలో గోల్డ్ కొనుగోలు చేస్తున్నారు. ఆ వివరాలు..

బంగారం రేట్లు పెరగడంతో కొనుగోలు విషయంలో ప్రజల అభిప్రాయం మారుతుందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. బంగారంపై రికార్డ్ స్థాయిలో 40 శాతం పెట్టుబడులు పెరిగాయని, 2025 మొదటి తొమ్మిది నెలల్లో ఇండియాలో మొత్తం బంగారం డిమాండ్ 14 శాతం తగ్గిందని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

**1 / 5**

ఇప్పటివరకు ఈ ఏడాదిలో గోల్డ్ రేట్లు 67 శాతం పెరిగాయి. డిసెంబర్ 26న ఔన్సుకు రికార్డు స్థాయిలో 4,59.7 డాలర్లకు చేరుకుంది. ఇక భారదేశంలో గోల్డ్ రేట్లు 77 శాతం పెరగ్గా.. నిఫ్టీ ఇండెక్స్ 9.7 శాతం లాభాన్ని అధిగమించింది. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 శాతం తగ్గడం ఇందుకు తోహదపడిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**2 / 5**

బంగారు ఆభరణాలకు బదులు గోల్డ్ కాయిన్స్, కడ్డీలను ఎక్కువమంది కొనుగోలు చేస్తున్నారు. ఆభరణాలకు డిమాండ్ తగ్గగా.. బంగారంలో పెట్టుబడి పెరిగింది. చిన్న నాణేలు, కడ్డీల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అలాగే డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్‌లో గోల్డ్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయి.

**3 / 5**

ఇండియాలో పండుగలు, పెళ్లిళ్ల సమయంలో తప్పనిసరిగా గోల్డ్ కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇక పండుగల సమయంలో బంగారం కొనడాన్ని శుభప్రదంగా భారతీయులు నమ్ముతారు. అయితే 2025లో బంగారం ధరలు భారీ ర్యాలీ కారణంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు తగ్గిపోయారు. అసలే ధరలు పెరగడంతో పాటు మేకింగ్ ఛార్జీలు అధికం అవ్వడం వల్ల బంగారం సేల్స్ తగ్గిపోతున్నాయి.

**4 / 5**

బంగారం ధరలు 2025లో రికార్డు స్థాయిలో పెరిగాయి. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో గోల్డ్ రేట్లు ఆల్ టైం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ట్రంప్ సుంకాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పతనం వంటి కారణాల వల్ల పసిడి ధరలు పెరుగుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో బంగారం సేల్స్ భారీగా తగ్గిపోయాయి.

## ట్రైన్ టికెట్ బుక్ చేసుకునేవారికి శుభవార్త..

# ఏకంగా 6 శాతం తగ్గింపు.. రైల్వేశాఖ బంపర్ ఆఫర్




రైలు టికెట్లు బుక్ చేసుకునేవారికి భారతీయ రైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. టికెట్ల బుకింగ్‌పై 6 శాతం రాయితీ ప్రకటించింది. ఇందుకోసం రైల్ వన్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే ఆఫర్ వర్తిస్తుంది. ప్రయాణికులకు రైల్వేశాఖ అదిరిపోయే శుభవార్త అందించింది. రైల్వే టికెట్ల బుకింగ్‌పై ఏకంగా 6 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. అన్ రిజర్వ్‌డ్ జనరల్ టికెట్లపై ఈ ఆఫర్ వర్తించనుంది. ప్రయాణికులు ఆన్లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునేందుకు రైల్ వన్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు బుక్ చేసుకుంటే 3 శాతం డిస్కౌంట్ లభించనుంది. అలాగే ఈ యాప్‌లో ఆర్ వ్యాలెట్ ద్వారా చెల్లింపులు చేస్తే మరో 3 శాతం రాయితీ లభించనుంది. ఇలా టికెట్లపై మొత్తం 6 శాతం డిస్కౌంట్ రానుంది. వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది.

**డిసెంబర్ 30న లేఖ**

రైల్ వన్ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ టికెట్ల బుకింగ్‌పై ఏ మోడ్‌లో పేమెంట్ చేసినా ఈ ఆఫర్ వర్తిస్తుందని రైల్వేశాఖ స్పష్టం చేసింది. ఈ ఆఫర్ యూజర్లకు అందుబాటులోకి తెచ్చేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని సెంటర్ ఫర్ రైల్వే ఇనార్మేషన్ సిస్టమ్స్ (%జ=×ూ%)కు రైల్వేశాఖ డిసెంబర్ 30న లేఖ రాసింది. ఆర్ వ్యాలెట్ వినియోగదారులకు మాత్రమే కాకుండా యూపీఐ, క్రెడిట్ లేదా డెబిట్, నెట్ బ్యాంకింగ్ ద్వారా చేసే చెల్లింపులకు ఈ డిస్కౌంట్ లభించనుంది. దీంతో జనవరి 14 నుంచి ఆర్ వ్యాలెట్ ద్వారా పేమెంట్ చేసేవారికి 6 శాతం డిస్కౌంట్ వస్తుందన్నమాట.

**రైల్ వన్ యాప్ అంటే..**

మొన్నటివరకు వివిధ రైల్వే సేవలకు వివిధ ఫ్లాట్‌ఫామ్స్ అందుబాటులో ఉండేవి. టికెట్లు బుక్ చేసుకోవాలంటే ఐఆర్‌సీటీసీ, రైళ్ల లైవ్ ట్రాకింగ్ తెలుసుకోవడానికి %చీజుూ%, ఇక ఫిర్యాదుల కోసం రైల్ మసద్ యాప్ ఉపయోగించాల్సి వచ్చేది. ఇక రైల్లో ఆహారం కోసం ఫుడ్‌ఆన్ ట్రాక్ యాప్ అందుబాటులో ఉండేది. కానీ అన్నీ సేవలు ఒకేచోట అందించాలనే లక్ష్యంతో రైల్వే శాఖ రైల్ వన్ పేరుతో కొత్త యాప్ 2025లో లాంచ్ చేసింది. ఈ యాప్‌ను అందరూ ఉపయోగించేలా చేసేందుకు అనేక ఆఫర్లు ప్రకటిస్తోంది.

### మీ పాన్ కార్డ్ జాగ్రత్త.. లేదంటే ఎవరో తీసుకున్న లోన్ మీరు కట్టాల్సి వస్తుంది! కొత్త రకం మోసం..




ఇండియాలో పాన్ కార్డ్ ఆర్థిక గుర్తింపునకు కీలకం. మోసగాళ్లు మీ పాన్ వివరాలను దుర్వినియోగం చేసి రుణాలు తీసుకోవచ్చు. క్రెడిట్ స్కోర్ పడిపోవడం దీనికి సంకేతం. ఇలాంటి మోసాలను నివారించడానికి, మీ ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి పాన్- ఆధార్ లింకింగ్ తప్పనిసరి. ఇండియాలో పాన్ కార్డ్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదు, మొత్తం ఆర్థిక గుర్తింపుకు కీలకం. బ్యాంకు రుణాలు, క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు లేదా డిజిటల్ క్రెడిట్ ఇలా దాదాపు ప్రతి ఆర్థిక లావాదేవీ మీ పాన్ కార్డ్‌తో లింక్ అయి ఉంటుంది. ఈ వ్యవస్థ రుణం పొందడాన్ని సులభతరం చేసినప్పటికీ, అంతే జాగ్రత్తగా వాడాలి. లేదంటే ఇబ్బందులు తప్పవు. మీ పాన్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తే మీకు తెలియకుండానే మీ పేరుతో రుణాలు తీసుకోవచ్చు. రికవరీ ఏజెంట్లు కాల్ చేస్తున్నా, మీ సిబిల్ స్కోర్ పడిపోయినా.. మీ పాన్‌తో ఎవరో లోన్ తీసుకున్నారని అనుకోవచ్చు. ఇలాంటి మోసాల నుంచి మీ పాన్ కార్డును, మిమ్మల్ని రక్షించుకోవాలనుకుంటే.. మీ పాన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదు. ఇది గుర్తింపు దొంగతనాన్ని నివారించడానికి, మీ క్రెడిట్ స్కోర్‌కు దీరకాలిక నష్టాన్ని నివారించడానికి, మోసాన్ని ముందుగానే గుర్తించడానికి మీకు సహాయపడుతుంది. మీ తో లింక్ చేయబడిన రుణాన్ని ధృవీకరించడానికి క్రెడిట్ రిపోర్ట్ ఉపయోగపడుతుంది. దేశంలోని ప్రతి బ్యాంకు, నియంత్రిత డిజిటల్ రుణదాత క్రెడిట్ బ్యూరోలకు రుణ సమాచారాన్ని అందిస్తారు. మీ పేరు మీద ఉన్న ఏవైనా రుణాలు మీ నివేదికలో కనిపిస్తాయి. మీరు %ువీఖంఖఅఅశీఅ జ×దీ×ూ, జుఞజూవతీఖుఅ ×అఎఖు, జునబఱఖుఞ ×అఎఖు% లేదా %జ=×ఖీ% హై మార్క్ అధికారిక వెబ్‌సైట్‌లను సందర్శించడం ద్వారా మీ క్రెడిట్ నివేదికను యాక్సెస్ చేయవచ్చు. మీరు మీ %ూూచీ% నంబర్, కొన్ని ప్రాథమిక సమాచారాన్ని అందించాలి. ప్రతి బ్యూరో కనీసం సంవత్సరానికి ఒకసారి ఉచిత నివేదికను అందిస్తుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

పైన పేర్కొన్న ఆందోళనకరమైన అంశాలు ఏవీ మీ పాన్‌కు సంబంధం లేకపోతే అది మంచి విషయం. అయితే మీ పాన్ కార్డును రక్షించుకోవడం గుర్తుంచుకోవడం కూడా ముఖ్యం. తెలియని వెబ్‌సైట్‌లు లేదా ఏజెంట్లతో మీ పాన్ వివరాలను పంచుకోవడం మానుకోండి. అవసరమైతే మీ పాన్ కాపీని వాటర్‌మార్క్ చేయండి. సంవత్సరానికి కనీసం రెండుసార్లు మీ క్రెడిట్ నివేదికను తనిఖీ చేయండి. కొంచెం అప్రమత్తంగా ఉండటం వల్ల గణనీయమైన ఆర్థిక నష్టాల నుండి మిమ్మల్ని కాపాడుకోవచ్చు.

### ఎలక్ట్రిక్ 3-వీలర్ కొనుగోలుదారుకు షాకింగ్ న్యూస్..! కేంద్రం నిర?యంతో ఇకపై..




ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకం కింద లక్ష్యాన్ని సాధించింది. దీంతో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లకు సబ్సిడీలను ఉపసంహరించుకోవాలని కేంద్రం నిర?యించిన్నట్టుగా తెలిసింది. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులు వెల్లడించారు. త్రీ-వీలర్ విభాగంలో విద్యుత్ వ్యాప్తి అంచనా ప్రకారం 32శాతానికి పెరిగింది, ఈ పథకాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న స్థాయి కంటే ఇది ఎక్కువగానే రీచ్ అయింది. ఈ మైలురాయిని చేరుకున్న తర్వాత, జాతీయ స్థాయిలో ప్రత్యక్ష మద్దతు ఇకపై అవసరం లేదని కేంద్రం భావిస్తున్నట్టుగా సమాచారం. బదులుగా రాష్ట్ర ప్రభుత్వాలు ముందంజలో ఉండాలని కోరుకుంటుంది. కాలుష్య స్థాయిలను తగ్గించడానికి, ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే సెంట్రల్ సర్కార్ ప్రతిష్టత్మకంగా చేపట్టిన డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈ పథకం లక్ష్యం దాదాపు 2.9 లక్షల 5 కేటగిరీ ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు అమ్మకాలు సాధించబడింది. దీంతో డ్రైవ్ పథకం కింద విద్యుత్ త్రిచక్ర వాహనాలకు సబ్సిడీలను తొలగించింది. అవును,.. ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకున్న క్రమంలో ఈ నిర?యం తీసుకున్నట్టుగా తెలిసింది. కేంద్ర ప్రభుత్వ నిర?యంతో ఇకపై త్రిచక్ర వాహనాల కొనుగోలుపై ప్రజలు ఎటువంటి సబ్సిడీ లభించదు. ఈ నిర?యం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల మార్కెట్ వాటా 32శాతానికి పెరిగింది. ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను త్రీ-వీలర్ మార్కెట్‌లో 20-30శాతానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం ఇప్పుడు సాధించినట్టుగా ఒక అధికారి పేర్కొన్నారు. పరిశ్రమ కూడా ఈ నిర?యంతో ఏకీభవిస్తోందని చెప్పారు. 5 కేటగిరీ కోసం 2.88 లక్షల వాహనాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని కూడా సాధించారు. 2025లో 7.5 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. వీటిలో 60శాతం %జుఎ%లు ఉన్నాయి. ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహనాలలో (%వ-2ఔ%) ప్రవేశం 7.5శాతం మాత్రమే. లక్ష్యం 25 లక్షల యూనిట్లు, కానీ ఇప్పటి వరకు 18.3 లక్షల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ సంఖ్య 23 లక్షలకు చేరుకుంటుందని అంచనా. అందువల్ల ద్విచక్ర వాహనాలకు సబ్సిడీ వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో కూడా కొనసాగే అవకాశం ఉంది. కొత్త సంవత్సరం ప్రారంభంలో కొత్త నిర?యం తీసుకోబడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఈ లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తోంది. అనేక రాష్ట్రాలు తమ సొంత పథకాలు, ప్రోత్సాహకాలను ప్రవేశపెడుతున్నాయి. వచ్చే నెలలో కొత్త ప్యాకేజీ ప్రకటించబడవచ్చునని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలు కూడా రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గింపులు, ఇతర ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఇకపోతే, నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చాలా తక్కువగా ఉందని, కాబట్టి అక్కడ కూడా రాష్ట్ర స్థాయి మద్దతు అవసరం అంటున్నారు. డ్రైవ్ పథకం 14,000 ఎలక్ట్రిక్ బస్సులు, 5,643 ట్రక్కులకు మద్దతు ఇస్తుంది. అయితే, వాహనాలు ఇంకా టెస్ట్ ట్రయల్ దశలో ఉన్నందున వీటికి డిమాండ్ అంతగా లేదని అంటున్నారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు అతిపెద్ద సవాలు అని, ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు ముందుకు రావాలని పరిశ్రమ నిపుణులు అంటున్నారు.

### ఆధార్ కార్డ్‌లో పేరు మార్చడం ఇప్పుడంతా ఈజీ కాదు! రూల్స్ మారిపోయాయి.. నేమ్ అప్డేట్ చేయాలంటే?



ఆధార్ కార్డు పేరు మార్పు నిబంధనలను కఠినతరం చేసింది. పూర్తి పేరు లేదా ఇంటిపేరు మార్పునకు కేవలం అఫిడవిట్ కాకుండా, గెజిట్ నోటిఫికేషన్ తప్పనిసరి. చిన్న స్పెల్లింగ్ తప్పులకు అవసరం లేదు. మోసాలను నిరోధించడానికి ఈ నూతన నియమాలు అమలులోకి వచ్చాయి. ఆధార్ కార్డ్‌లో పేరు, అడ్రస్ లేదా ఏదైనా అప్డేట్ చేయాలంటే.. చాలా మంది అదెంత సేపు చిటికెలో అయిపోతుందని అనుకుంటారు. అనేక ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడంతో ప్రభుత్వం చాలా సులువుగా కార్డ్‌ను అప్డేట్ చేసేందుకు అనేక అవకాశాలు ఇచ్చింది. కానీ ఇకపై ఆధార్ కార్డులో పేరు మార్చుకోవడం అంత ఈజీ కాదు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ రూల్స్‌ను కఠినతరం చేసింది. ఇప్పుడు పేరు మార్పుకు కేవలం అఫిడవిట్ సరిపోదు. దీని కోసం మీరు గెజిట్ నోటిఫికేషన్, సుదీర ప్రక్రియ అవసరం అవుతుంది. గతంలో స్థానిక కౌన్సిలర్ నుండి ఒక లేఖ లేదా నోటరీ చేయబడిన సాధారణ అఫిడవిట్ సరిపోయేది, ఇప్పుడు మీరు మీ పేరులో మార్పులు చేస్తుంటే (మీ పూర్తి పేరును మార్చడం లేదా ఇంటిపేరును జోడించడం/తొలగించడం వంటివి), %ఖ×ణూ×%కి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అవసరం కావచ్చు. గుర్తింపు మోసాన్ని నిరోధించడానికి, పత్రాల ప్రామాణికతను నిర్ధారించడానికి ఈ కఠినమైన నియమాలు రూపొందించారు. అయితే మీ పేరులో స్వల్ప స్పెల్లింగ్ దిద్దుబాటు మాత్రమే ఉంటే, మీకు గెజిట్ అవసరం ఉండకపోవచ్చు. మీరు మీ పేరును పూర్తిగా మారుస్తుంటే, లేదా వివాహం తర్వాత మీ ఇంటిపేరును మారుస్తుంటే, మీ వద్ద ఎటువంటి దృఢమైన రుజువు లేకపోతే, గెజిట్ నోటిఫికేషన్ అవసరం. ఈ ప్రక్రియలో మీరు మొదట ఒక అఫిడవిట్ సిద్ధం చేయాలి. తరువాత, మీరు మీ పేరు మార్పును రెండు వార్తాపత్రికలలో (ఒకటి ఆంగ్లంలో, మరొకటి స్థానిక భాషలో) ప్రకటించాలి. చివరగా ఈ అన్ని పత్రాలు, ఫొటోలు, దరఖాస్తును భారత ప్రభుత్వ ప్రచురణ విభాగానికి పంపాలి. మీ కొత్త పేరు అధికారిక గెజిట్‌లో ప్రచురించబడిన తర్వాత అది చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుంది. కొన్నిసార్లు గెజిట్ నోటిఫికేషన్ ఉన్నప్పటికీ సిస్టమ్ అప్డేట్‌ను అంగీకరించడంలో విఫలమవుతుంది. అటువంటి పరిస్థితిలో మీరు నేరుగా UIDAI హెల్ప్‌లైన్ నంబర్ 1947 కు కాల్ చేయవచ్చు లేదా help@uidai.net.in కు ఇమెయిల్ చేయవచ్చు. గెజిట్ నోటిఫికేషన్ అనేది ఏ ప్రభుత్వ శాఖ కూడా విస్మరించలేని శక్తివంతమైన ఆయుధం

## హైదరాబాదీ వైబ్ కనిపిస్తుంది!




ఎంఎస్ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అమీర్ లోగ్'. రమణారెడ్డి సోమ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మాధవి రెడ్డి సోమ నిర్మాత. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేస్తున్నది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రమణారెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాద్ వైబ్ ఉన్న సినిమా ఇది. ఇక్కడ ప్రజల జీవితానికి ప్రతీకలా ఉంటుంది. ఈ కథలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. హైదరాబాద్ నేటివిటీ అందరిని మెప్పిస్తుంది' అన్నారు. ఇస్త్రీలో పుట్టి పెరిగిన వాడను..ఓ ఇస్త్రీ కథతో తయారైన సినిమాలో నటించడం ఆనందంగా ఉందని హీరో ఎంఎస్ హరి పేర్కొన్నారు. వేద జలంధర్, రాహుల్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్వరదీసాయి, దర్శకత్వం: రమణా రెడ్డి సోమ.



## కర్నల్ వెంకటరెడ్డి కామెడీ

అగ్ర కథానాయకుడు వెంకటేశ్, సుందరమూర్తి కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఓ భారీ వినోదాత్మక మల్టీస్టారర్‌ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ సరసన కీర్తి సురేశ్, కల్యాణ్‌రామ్‌కి జోడీగా కృతి శెట్టి నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. 40ఏండ్ల సినీ ప్రస్థానాన్ని వెంకటేశ్ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇండియన్ ఆర్మీ యూనిఫామ్‌లో, సన్ గ్లాసెస్, స్కార్ఫ్ ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న వెంకటేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఓ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ పక్కన నిల్చుని సీరియస్‌గా చూస్తున్న ఆయన లుక్‌ని బట్టి ఇందులో రగ్గడ్ మిలటరీ ఆఫీసర్‌గా వెంకటేశ్ కనిపించబోతున్నారనే విషయం అర్థమవుతున్నది. కౌంటర్ టెర్రరిజం, హోస్టేజ్ నెగోషియేషన్‌లో నిష్ణాతుడైన 'కర్నల్ వెంకటరెడ్డి'గా ఈ పోస్టర్ ద్వారా వెంకటేశ్‌ని పరిచయం చేశారు. వెంకీ, కల్యాణ్‌రామ్ మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయని, హ్యూమర్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాతో సాగే అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సమర్పణ: సురేశ్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, శ్రీమతి అర్చన.



## పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్

రియల్‌స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. కెల్లా రోహిత్ దర్శకుడు. కెల్లా రాహుల్ నిర్మాత. ఆగస్ట్ 15న శ్రీహరి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సంస్కృతిలో భాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న మేఘాంశ్ శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోతురాజు గెటప్‌లో మేఘాంశ్ కనిపిస్తుండగా, అతని నేపథ్యంలో శ్రీహరి కూడా కనిపిస్తుండటం ఈ ఫస్ట్‌లుక్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే 60శాతం ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకున్నదని, త్వరలోనే టైటిల్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ గ్లింప్స్ ద్వారా ఈ సినిమాలోని హీరో ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వారు తెలిపారు.

## తెలంగాణ ప్రేమకథ శనార్తి



'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్‌రాజ్, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'శనార్తి' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సంపత్‌నంది టీమ్ వర్క్స్, శ్రీధనలక్ష్మి ప్రొడక్షన్స్ పతాకాలపై కవి శ్రీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజ్‌గణేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన టైటిల్ పోస్టర్ 'ఎ టేల్ ఆఫ్ కల్చర్' అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వేడుకల్ని ప్రతిబింబించేలా ఉంది. అగ్ర దర్శకుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సంపత్‌నంది చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలంగాణ పల్లెల్లో ప్రజలు ఆత్మీయంగా పలకరించుకునే సందర్భంలో ఉపయోగించే పదం 'శనార్తి'. ఈ ప్రేమకథకు ఈ పదం అద్భుతంగా సరిపోతుంది. అఖిల్‌రాజ్-నాగదుర్గ జోడీ ఈ కథకు బాగా కుదిరారు' అన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, సమర్పణ: ఆదిత్య మూవీస్, దర్శకత్వం: రాజ్‌గణేష్ ఉప్పునూతల



## కీర్తి నిజంగా వేరే లెవల్

కీర్తిసురేశ్ తెరపైనే కాదు. రియల్ లైఫ్‌లోనూ షార్ప్‌గా ఉంటారు. తనపై వచ్చే విమర్శలను తిప్పికొట్టడంలో ఆమె శైలి ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా ఆమె నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో భాగమైంది. ఆ సినిమాలోని ఓ ప్రత్యేక గీతంలో కీర్తి సురేశ్ నర్తించింది. ఈ విషయంపై ఓ యువతి.. అవకాశాలు లేక ఐటమ్ సాంగ్ చేసిందంటూ కీర్తి సురేశ్‌ని విమర్శిస్తూ తన ఇన్‌స్టాలో ఓ వీడియోని షేర్ చేసింది. పైగా 'ది ప్యారడైజ్' సినిమాను కన్నడ సినిమాగా ఆమె ఆ వీడియోలో పేర్కొన్నది. ఈ విమర్శపై కీర్తి సురేశ్ కూల్‌గా తనదైన శైలిలో సమాధానమిచ్చింది. 'ది ప్యారడైజ్'ని కన్నడ సినిమా అనడంపై 'వేరే లెవల్..' అంటూ కీర్తి సెటైర్ విసిరింది. 'చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్న తెలుగు సినిమా మా.. కన్నడ సినిమా కాదు' అంటూ కౌంటరిచ్చింది. అంతే.. సరిగ్గా చెప్పావ్ అన్నట్టుగా పలువురు నెటిజన్లు కీర్తి సురేశ్‌ని అభినందిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers,5-11-126/2A, Railway Kaman Track, Sony Function Hall Road, Nizamabad.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com